సాక్షి జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



పదోన్నతులకు లైన్ క్లియర్..

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులకు ప్రభుత్వం నుంచి లైన్‌క్లియర్ అయింది. దీంతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. - 8లో▸



పురాతన ఆలయాలకు పూర్వవైభవం

కాకతీయుల కాలం నాటి దేవాలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
28.2⁰ /23.4⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లక్షపత్రి పూజలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి లక్షపత్రి పూజలను అర్చకులు వేదమంత్రోచ్చరణలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో భక్తుల సందడి నెలకొంది. వివిధ పూజలు, లడ్డు ప్రసాదాలతో రూ.85వేల ఆదాయం సమకూరినట్లు ఈఓ మారుతి తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతి



చిట్యాల: మండలంలోని కై లాపూర్ గ్రామ శివారు శాంతినగర్‌లో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ గురువారం మండలకేంద్రంలో వినతిపత్రం అందజేశారు. శాంతినగర్‌లోని విద్యార్థులు చదువుకోవడానికి ఐదు కిలోమీటర్లు పోవాల్సి వస్తుందని తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనాన్ని మంజూరు చేయాలన్నారు. గ్రామంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పర్లపెల్లి శ్రీకాంత్, నాయకులు బొడ అమరేందర్, రాంబాబు, రమేష్, సారంగం, రవి పాల్గొన్నారు.

ఏజీపీ శివకుమార్‌కు ఘన సన్మానం



మల్హర్: ఇటీవలే భూపాలపల్లి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు శివకుమార్‌ను భూపాలపల్లి న్యాయవాదులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. చిన్న వయసులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఎన్నికవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంగా బాధ్యతను అప్పగించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా సుజేందర్



భూపాలపల్లి అర్బన్: బీఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా వెలబోయిన సుజేందర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ప్రకటించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో గురువారం బీఎంఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్తయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏరియా బ్రాంచ్ కమిటీ, గని గనుల పిట్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రెండేళ్ల పాటు నూతన కమిటీలు క్రమశిక్షణతో నడుచుకోవాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. బ్రాంచ్ కార్యదర్శులు రేణుకుంట్ల మల్లేష్, రాసాకట్ల నర్సింగరావు, అల్లం శ్రీనివాస్, రాజ్‌కుమార్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నారాయణ, కోశాధికారిగా రఘుపతిరెడ్డి, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలను నియమించారు. ఏరియాలోని వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు బీఎంఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రమాకాంత్, సారంగపాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

‘మీనం’ ఆలస్యం



టెండర్లకు ముందుకురాని కాంట్రాక్టర్లు

- ఇప్పటికే రెండుసార్లు గడువు పెంపు..
- గతేడాది గిట్టుబాటు కాలేదని వెనుకంజ..
- ఈనెల 13వరకు గడువు పెంచిన మత్స్యశాఖ
- జిల్లావ్యాప్తంగా 9,600మంది మత్స్యకారులు
- నెలలు గడిస్తే చేపల ఎదుగుదలపై ప్రభావం

కాళేశ్వరం: ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ఈ ఏడాది మరింత ఆలస్యం కానుంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు నీటితో కిటకిటలాడుతున్నాయి. కానీ చేపపిల్లలను వదిలేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ అధికారులు టెండర్లకు ఆహ్వానించారు. గత నెల 10నుంచి 26వరకు టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. అప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆగస్టు 2వరకు పొడిగించారు. టెండర్ల ప్రక్రియను పొడిగించినా కాంట్రాక్టర్లు ఎవ్వరూ రాలేదు. దీంతో మళ్లీ ఈనెల 13వరకు గడువు పెంచారు. బిల్లులు సక్రమంగా రాక కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

ఎదుగుదలపై ప్రభావం..

టెండర్ల ప్రక్రియ ఆలస్యం కారణంగా చేపపిల్లల పంపిణీలో జాప్యం నెలకొని, ప్రాజెక్టులు, చెరువుల్లో వాటిని వదిలినా అనుకున్న మేరకు ఎదిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని మత్స్యశాఖ అధికారులు వాపోతున్నారు. జూలై నుంచి ఆగస్టు నెలలోగా చేప పిల్లలను వదలాల్సి ఉండగా.. ఈ ఏడాది మాత్రం టెండర్ల ప్రక్రియ దశలో ఉండడం..కాంట్రాక్టర్లు సైతం ముందుకురాక అసలు ఉచిత చేప పిల్లల పంపిణీ ఉంటుందో? లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పంపిణీ లక్ష్యం..

జిల్లాలో 2.90కోట్ల చేప పిల్లలను వదలడం లక్ష్యం. 25లక్షల రొయ్యలను వదలడానికి ప్రణాళికలను మత్స్యశాఖ అధికారులు చేశారు. జిల్లాలో ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో ఇరిగేషన్‌శాఖ ఆదేశాలతో చేపలు, రొయ్యలు వదిలేందుకు ప్లాన్ చేస్తున్నారు. అన్నారం బరాజ్, గణపురం, పంబాపూర్, బొగ్గులవాగుల్లో చేపల పంపిణీ చేయడానికి టెండర్లు పిలిచారు. జిల్లావ్యాప్తంగా 116 మత్స్యకారుల సంఘాల్లో 9,600మంది ఉన్నారు. చేపలు వదలడంతో వీరికి జీవనోపాధి లభిస్తుంది.

బిల్లులు రాకనే..

గతేడాది చెరువుల్లో చేపపిల్లలు వదిలిన కాంట్రాక్టర్లకు నేటికీ పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా ఈసారి టెండర్లను బహిష్కరించినట్లు తెలిసింది. గతంలో జరిగిన అవినీతిని దృష్టిలో పెట్టుకుని కొత్త ప్రభుత్వం పంపిణీ విషయంలో కచ్చితమైన నిబంధనలు విధించింది. జిల్లా, మండల, గ్రామ స్థాయి వ్యవసాయ, పంచాయతీ తదితర శాఖల అధికారులు, మత్స్యకారుల సంఘం సభ్యుల ఎదుట పిల్లలను పంపిణీ చేయాలన్న నిబంధన కాంట్రాక్టర్లకు ఇబ్బందిగా మారిందని తెలుస్తోంది. ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు చెరువులను గుర్తించి, వాటిలో చేప పిల్లలు వదిలేందుకు జిల్లా లక్ష్యం విధించినా ఎవరూ టెండర్లలో పాల్గొనడం లేదు. రావడానికి మక్కువ చూపడం లేదు.

కాంట్రాక్టర్లు రావడం లేదు..

చేప పిల్లల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేశాం. చెరువులు, ప్రాజెక్టులను గుర్తించాం. జూలై–ఆగస్టులో చేపల ఎదుగుదలకు ఇబ్బంది ఉండదు. కానీ కాంట్రాక్టర్లు ముందుకు రాక ఆలస్యం జరుగుతుంది. ఈ నెల 13 వరకు గడువు పెంచాం.



- అవినాష్, జిల్లా మత్స్యశాఖ అధికారి

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని చింతలమోరి గొత్తికోయగూడెంలో మొక్కజొన్నలో కలుపు తీస్తున్న ఆదివాసీ దంపతులు



ఆదివాసీ.. అడవి నివాసి

అడవే ఆధారం.. బాహ్యప్రపంచంతో పెద్దగా సంబంధాలు లేని గూడేలు..మట్టి ఇళ్లు, గూనపెంకుల కప్పులు.. సంప్రదాయ పత్తి, మొక్కజొన్న పోడు వ్యవసాయం.. ఇవీ ఆదివాసీల ఆస్తి. ఒకవైపు ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. వాటిని పట్టించుకోరు. పాత పద్ధతులను అవలంబిస్తారు పచ్చటి అడవిని నమ్ముకుని జీవనం సాగించడం వీరి ప్రత్యేకత. నేడు (శుక్రవారం) అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కథనం 8లో

- ఏటూరునాగారం

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ర్యాగింగ్‌కు పాల్పడి విద్యార్థులు బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్పీ కిరణ్‌ఖరే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాగింగ్ లాంటి కేసుల్లో ఇరుక్కుంటే వారి బంగారు భవిష్యత్ కోల్పోతారని చెప్పారు. వ్యసనాలకు బానిసై విద్యార్థులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేస్తూ దోషులు కావదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి వివరాలను డయల్ 100కు తెలియజేసి పోలీసుల సహాయం పొందాలన్నారు. అన్ని విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులు జిల్లా పోలీసులు నిర్వహిస్తున్నారని, యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను, నడవడికను గమనించాలని తెలిపారు. ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని చెప్పారు. సీనియర్లు, జూనియర్లు అని కాకుండా సీనియర్లు జూనియర్లకు గైడ్‌లా వ్యవహరిస్తూ, స్నేహితులుగా పెద్దన్న పాత్ర పోషిస్తూ, జూనియర్లకు మార్గదర్శకంగా ఉండాలన్నారు.

ఓసీ-3 బాధిత గ్రామాన్ని పరిశీలించిన కలెక్టర్

భూపాలపల్లి రూరల్: ఓసీ–3 బాధిత గుర్రంపేట ఎస్సీ కాలనీలో కలెక్టర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ ఉపరితల గనిలో జరుగుతున్న బాంబు పేలుళ్లతో తమ ఇళ్లు ధ్వంసమవుతున్నాయని తమ గ్రామాన్ని తరలించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. దీంతో కలెక్టర్ నేరుగా గుర్రంపేట ఎస్సీ కాలనీలో సింగరేణి అధికారులతో కలిసి పర్యటించి ఓసీ–3 పేలుళ్ల ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్ రాక సందర్భంగా తక్కువ మోతాదులో బాంబులు పేల్చారని తెలిపారు. మళ్లీ ఆకస్మిక తనిఖీ చేస్తామని పేలుళ్ల ఉధృతిని తనిఖీ చేసి గ్రామస్తులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, సింగరేణి అధికారులు ఉన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు తెలుపుతున్న గ్రామస్తులు

గంజాయి ముఠా అరెస్ట్

2కిలోలు స్వాధీనం

భూపాలపల్లి: గణపురం మండలం పరిధిలో గంజాయి తరలిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. గణపురం మండలంలోని గొల్లపల్లి క్రాస్ వద్ద చిట్యాల సీఐ మల్లేష్, గణపురం ఎస్సై అశోక్ వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జనగం ప్రేమ్ తేజ్ (వెంకటేశ్వర్లపల్లి), లావుడ్య సిద్దు(వేశాలపల్లి), కీసర సంతోష్ (కొండాపూర్), కొండగొర్ల రంజిత్(యామన్‌పల్లి), మేకల అరుణ్ (భూపాలపల్లి), కడారి సాయికుమార్(భూపాలపల్లి) ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో ఒకరు ద్విచక్ర వాహనంపై, ఐదురుగు ఆటోలో కనిపించినట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా.. బ్యాగ్‌లో రెండు కేజీల ఎండు గంజాయి కనిపించినట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో చిట్యాల సీఐ మల్లేష్, గణపురం ఎస్సై అశోక్, సిబ్బంది రాజు, నేతాజీ, శ్రీనివాసులు, యాకేష్ పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు.. 1.8కేజీలు స్వాధీనం

కాటారం: కాటారంలో యువతకు గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను గురువారం కాటారం ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు మండలకేంద్రంలో పట్టుకొని అరెస్ట్ చేశారు. ఏడుగురిపై కేసు నమోదుచేసి 1.8 కేజీల గంజాయి స్వాధీన పర్చుకున్నారు. ఇన్‌చార్జ్ సీఐ రాంచందర్‌రావు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలకేంద్రంలో కొందరు వ్యక్తులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు మంథని రహదారి వైపు గల ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలో ఆదివారంపేట మూలమలుపు వద్ద ఉదయం రెక్కీ నిర్వహించారు. కాటారానికి చెందిన దుర్గం నందకిశోర్ అనే యువకుడు బయ్యారానికి చెందిన జగజంపుల విష్ణు, కొత్తపల్లికి చెందిన నిఖిల్‌రాజ్, కాటారానికి చెందిన కడారి కార్తీక్, మారుపాక రిశ్వంత్, మెరిజాల రోహిత్, ఎర్రగుంటపల్లికి చెందిన జక్కు రాజేశ్‌కు గంజాయిని ఇస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి 1.8 కేజీల గంజాయి స్వాధీనపర్చుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టినట్లు తెలిపారు. భూపాలపల్లికి చెందిన లావుడ్య సిద్దు వద్ద రూ.36వేలకు 1.8కేజీల గంజాయి కొనుగోలు చేసినట్లు నందకిశోర్ విచారణలో ఒప్పుకున్నట్లు వివరించారు. ఏడుగురు నిందితులు గంజాయి స్మగ్లింగ్‌లో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై మ్యాక అభినవ్, కానిస్టేబుళ్లు లక్ష్మీరాజం, హరికుమార్, జంపన్న, సాంబశివరావు, లవన్, నరేశ్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

వంతెనపై నిలిచిన బొగ్గు లారీ

మల్హర్: మండలంలోని మల్లారం ఆరెవాగు వంతెనపై బొగ్గు లారీ చెడిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ నుంచి భూపాలపల్లి జెన్‌కోకు తరలిస్తున్న బొగ్గు లారీ మల్లారం ఆరెవాగు వంతెన పైకి రాగానే బండి ముందు భాగంలోని పట్టాలు విరిగిపోయాయి. దీంతో వంతెన మధ్యలో లారీ నిలిచిపోయింది. వంతెన మీదుగా తాడిచర్ల–కొయ్యూరు వైపు వెళ్తున్న వాహనాలకు రెండు గంటలకు పైగా అంతరాయం ఏర్పడింది. ఏఎమ్మార్ అధికారులు అక్కడికి చేరుకొని కంపెనీకి చెందిన భారీ వాహనంతో లారీని ముందుకు జరిపించి రోడ్డును క్లియర్ చేశారు. దీంతో రవాణా యథావిధిగా సాగింది.



బ్రిడ్జిపై నిలిచిన బొగ్గు లారీ

గురుకులాల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు

కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సీపీఓ, ఎస్సీ సంక్షేమ, గురుకుల, బీసీ, మైనార్టీ, జ్యోతిబా పూలే, విద్యా, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని సంక్షేమ శాఖల వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు మండల ప్రత్యేకాధికారులు, ఆయా శాఖల సంక్షేమ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ప్రిన్సిపాల్స్ ప్రతిపాదనలు అందచేయాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు తనిఖీ నిర్వహించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గురుకుల, సంక్షేమ పాఠశాలలకు తాగునీరు సరఫరా చేయాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కిటికీలు, తలుపులు, మరుగుదొడ్లు మరమ్మతులకు, నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యజమానులదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీపీఓ శామ్యూల్, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సునీత, శైలజ, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, డీఈఓ రాజేందర్, ఎస్సీ జిల్లా సమన్వయ అధికారి భిక్షపతి, విద్యుత్ డీఈ నాగరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వచ్ఛదనం–పచ్చదనం


స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వివరాలను మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం, పారిశుద్ధ్య నిర్వహణ, స్వచ్ఛ ఆటోల నిర్వహణ, స్వీపింగ్ యంత్రం వినియోగం, స్వచ్ఛ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటులో అలసత్వం వహిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్‌ను తనిఖీ చేసి కుక్కల వృద్ధి నియంత్రణకు జరిపే ఆపరేషన్లలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం 3వ వార్డులో పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి 3వ తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలు చదివించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, పశుసంవర్ధక శాఖ అధికారి గోపాల కృష్ణమూర్తి, టీపీఓ సునీల్, మున్సిపల్ ఇంజనీర్ మానస, మేనేజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రోడ్డు ఊడుస్తున్న మార్నేని, గండ్ర, ప్రకాశ్‌రెడ్డి

మొగుళ్లపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని ఆకినపల్లి, పెద్దకోమటి గ్రామాల్లో నిర్మించిన పల్లె దవాఖానాలను ప్రారంభించారు. అనంతరం ములకలపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేశారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ గోదాంను, కార్యాలయాన్ని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఇస్సిపేట గ్రామంలో పీఏసీఎస్ గోదామును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు తో కలిసి ఎమ్మెల్యే చీపురు పట్టి రోడ్డుపై చెత్తను శుభ్రం చేశారు.

కాళేశ్వరంలో మళ్లీ దొంగల బీభత్సం

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఓ సెల్‌ఫోన్ (మొబైల్) దుకాణంలో మళ్లీ దొంగలు పడ్డారు. వరుస చోరీలతో జనం బెంబేలెత్తుతున్నారు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి కత్తితో ఇనుప రేకు టీలాను కట్ చేసి షాపులోకి దూరి చోరీకి పాల్పడ్డాడు. మొబైల్ షాపులోని రూ.30వేల విలువ గల మూడు రిపేరుకు ఇచ్చిన సెల్‌ఫోన్‌లను దొంగిలించాడు. గురువారం ఉదయం సెల్‌ఫోన్ యజమాని తూనూరి రాజబాపు(చిన్న) వచ్చి షాపు తెరవగా.. దొంగతనం జరిగినట్లు గుర్తించి సీసీ కెమెరాను పరిశీలించాడు. చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. గతంలో ఇదే సెల్‌ఫోన్ దుకాణంలో జనవరి 23న రాత్రి చోరీకి పాల్పడ్డాడు. అప్పుడు రూ. 45వేల విలువగల సెల్‌ఫోన్లు, 50వేల నగదు దోచుకెళ్లాడు. ఆ దొంగనే మళ్లీ చోరీకి పాల్పడ్డాడని షాపు యాజమాని గుర్తించాడు. దీంతో లబోదిబోమంటూ కాళేశ్వరం పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి పరిశీలించారు.

లైట్ తీసుకుంటున్న పోలీసులు..

ఏప్రిల్‌లో కోటపల్లికి చెందిన వ్యక్తి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. జూన్‌లో బస్టాండ్ ఎదుట ఓ కిరాణ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలే రూ.20వేల నగదు దొంగిలించాడు. అదే రోజు సాయంత్రం బస్టాండ్ సమీపంలో ఓ బైక్‌ను దొంగిలించాడు. ఆ దుకాణంలో చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దీంతో పోలీసులు వారం పాటు గ్రామంతో పాటు చట్టుపక్కల ఫుట్ పెట్రోలింగ్ చేసి మమా అనిపించారు. ప్రస్తుతం మళ్లీ దొంగల అలజడి మొదలవడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన చోరీ కేసులను ఒక్కటి కూడా పోలీసులు ఛేదించకపోవడం గమనార్హం. దీంతో పోలీసులు లైట్ తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.



మొబైల్ షాపు వెనుక భాగంలో రేకును కత్తితో కట్ చేసిన దొంగ

శుభకార్యాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు

భూపాలపల్లి అర్బన్: పెళ్లిళ్లు, శుభకార్యాలకు టీజీఎస్ ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదిశాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అడవి బిడ్డ అరణ్య రోదన..

నేటికీ మారని ఆదివాసీల దుర్భర పరిస్థితులు

- రవాణా మార్గం లేని గూడేలు ఎన్నో
- విద్య, వైద్యం కోసం నానాటికీ పోరాటాలే
- హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు పాట్లు
- ఇప్పటికీ పోడు వ్యవసాయమే దిక్కు
- 1986లో ఐటీడీఏ ఏర్పాటైనా అభివృద్ధి శూన్యం..
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



మీరు చూస్తున్న ఊరు పేరు చింతలమోరి. ఇది పూర్తిగా ఆదివాసీ గొత్తికోయగూడెం. ఇక్కడ బడి లేదు.. ప్రభుత్వ దవాఖానలేదు. సరైన రోడ్డు లేక అడవిలో నుంచి నడుచుకుంటూ ఆ గూడేనికి చేరుకోవాలి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని గూడెం చింతలమోరి. గొత్తికోయలు ఛత్తీస్‌గఢ్‌ నుంచి 20 ఏళ్ల క్రితం వలస వచ్చి ఇక్కడ నివసిస్తున్నారు. దాలు, సోలార్‌ లైట్లతోనే వారు కాలం వెళ్లదీస్తున్నారు. కాగా, ప్రస్తుతం అక్కడ పీపుల్స్‌ హెల్పింగ్‌ హ్యాండ్స్‌ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఓ గుడిసెలో ప్రైవేట్‌ పాఠశాల ఏర్పాటు చేసి అందులో టీచర్‌ను నియమించి విద్యాబోధన చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న పంట సాగు చేస్తూ వచ్చిన పంటలో కొంత అమ్ముకుని తీసుకుని కొంత నిల్వ చేసుకుంటారు. వారికి ఎరువులు, పురుగుల మందుల వినియోగం తెలియదు. కేవలం మేక, పశు ఎరువు వినియోగిస్తూ పంటలు పండిస్తున్నారు. కనీసం ఎడ్లు కూడా లేకపోవడంతో భార్యాభర్తలు కలిసి కలుపుతీసేందుకు నాగలి పట్టుకుని దున్నుతుంటారు. ఇలాంటి జీవన చిత్రాలు ఏజెన్సీలో అనేకం ఉన్నాయి అంటే అతిశయోక్తికాదు.



వెదురుతో తయారు చేసిన ఊయలలో చిన్నారిని ఊపుతున్న తల్లి

ఏటూరునాగారం : ఆదివాసీ.. భారతదేశ ప్రాచీన తెగ. ఈ అడవి బిడ్డల ఆచారాలు.. వ్యవహారాలు, కట్టూ.. బొట్టూ, వేషధారణ.. వస్త్రధారణ పూర్తిగా ఇతరులకు భిన్నం. మైదాన ప్రాంతంలో సంబంధం లేకుండా పూర్తిగా అడవితల్లితో పెనవేసుకున్న బంధం వీరిది. అడవిలో లభించే ఆకులు, దుంపలే పరమాన్నం. పోడు వ్యవసాయమే జీవనాధారం. అయితే ఎన్ని ప్రభుత్వాలు.. ఎందరు పాలకులు మారినా వీరి దుర్భర పరిస్థితులు మారడం లేదు. ఎన్ని పథకాలు పెట్టినా.. ఎంత బడ్జెట్‌ కేటాయించినా చివరి వరకు చేరకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. ఈ క్రమంలో నేడు (శుక్రవారం) అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు.. ఆచార వ్యవహారాలు, ఆహార అలవాట్లు, సమస్యలపై 'సాక్షి' కథనం.

గిరిజనాభివృద్ధి కోసమే ఏర్పాటు

ఆదివాసీల అభివృద్ధే ధ్యేయంగా ఏటూరునాగారంలో 1986లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు అధికారి(పీఓ) పాలనలో 29 శాఖలకు అధికారులు, సిబ్బంది పనిచేస్తారు. వీరంతా ఆదివాసీల అభివృద్ధి కోసమే పనిచేయాల్సి ఉంది. అయితే కార్యాలయం ఉన్నప్పటికీ ఆదివాసీల బతుకుల్లో వెలుగులు నింపలేకపోతోంది. ఈనాటికీ కొందరు గూడేలకు రవాణాసౌకర్యాలు లేకుండా పోయాయి. కొన్ని చోట్ల వాగులు దాటుకుంటూ గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఊరట్లం– కొండాయి మధ్య రోడ్డు బురదమయంగా మారడంతో గ్రామస్తులు దినదినగండంగా బతుకుతున్నారు. కన్నాయిగూడెం మండలం ఎలిశెట్టిపల్లి నుంచి ఇప్పటి వరకూ కాల్వల రోడ్డు లేదు. కేవలం మట్టి రోడ్డుతో వాగులు, వంకలు దాటుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా అనేక గ్రామాలు ఉన్నాయి.

ఐటీడీఏ పరిధిలో..	
ఏజెన్సీ మండలాలు	13
గ్రామాలు	177
గ్రామ పంచాయతీలు	83
మొత్తం జనాభా	1,86,607
ఇళ్లు	48,052
పురుషులు, స్త్రీలు	82,088

చట్టాలు, సంప్రదాయాలు

5వ షెడ్యూల్‌ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం (2006) ఉంది. అయినా వనరులు దోపిడీకి గురవుతున్నాయని నానాటికీ ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం అమల్లోకి వచ్చిన సమయంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ కేవలం 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఐటీడీఏ జిల్లాలో 6,546 మందికి మందికి పోడు పట్టాలు అందజేశారు.

ప్రతీ పండుగ ప్రత్యేకత

కోయల్లో పుట్టుక, పురుడు నీల మీదే జరుగుతుంది. మంత్రసానీలు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు మడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్టు మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్లెలో వేసి బారసాల చేయడం ఆచారం. పిల్లల పేర్లు ఇలవేల్పు నమ్మక్క పేరుమీదే ఎక్కువ ఉంటాయి. నాగదేవత మీద, తాజాగా రాముడు, వెంకటేశ్వర్లు వంటి హిందూ దేవుళ్ల మీద కూడా నామకరణం చేస్తున్నారు. కోయ పండుగలు విభిన్నంగా.. విశిష్టంగా ఉంటాయి. ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగలేదా విత్తు పండుగ, సూరాల పండు, సుకలు పండుగా చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగింటి పండుగ, –కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్లకోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



పాఠం చెబుతున్న టీచర్‌ సాయి స్నేహ

జెనీవాలో గుర్తింపు

ప్రపంచంలోని అన్ని దేశాలు ఆదివాసీ సంరక్షణకు కృషి చేయాలనే ఉద్దేశంతో ఆదివాసీ హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల రక్షణకు ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకుంది. 1982 ఆగస్టు 9న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల ప్రతినిధులతో వర్కింగ్‌ గ్రూప్‌ సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించి ఆమోదించింది. అప్పటి నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అడవుల్లో దొరికినవి అమ్ముతాం



అడవుల్లో దొరికేవి మేము తెచ్చుకొని అమ్ముకుంటాం. వచ్చిన డబ్బుతో కిరాణ సామాను, బట్టలు కొనుక్కుంటాం. ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సాయం అందడం లేదు. ఆదుకుని ఉపాధి కల్పించాలి.

– రవ్వ ఐతే, చింతలమోరి

రోడ్డు సౌకర్యం కల్పించాలి



చింతలమోరి రోడ్డు లేదు. రోడ్డు సౌకర్యం కల్పించాలి. మేము ఎక్కడైనా పోతే నడుచుకుంటూ పోవాలి. రోడ్డు లేక ఎలాంటి వాహనం వచ్చే పరిస్థితి లేదు. పిల్లలను బడికి పంపడానికి కూడా ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం చూడాలి.

– కోస బీమా, చింతలమోరి

ఫలాలపై దృష్టి

అటవీ ఉత్పత్తుల ఫలసాయంపైనే ఆదివాసీలు దృష్టిసారిస్తారు. అడవిలో లభించే దీపుర్లు, ఉసిరికాయలు, పుట్టగొడుగులు, తునికాయలు, పాలపండ్లు, పునుకుకాయలు, బోడకాకర, తేనె, బంక, ఇప్ప పలుకులు, ఇప్ప పూలు విక్రయిస్తారు. వచ్చిన సొమ్ముతో సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుంటారు.



పుట్టగొడుగులు విక్రయిస్తున్న గిరిజన మహిళ



పత్తిచేనులో కలుపుతీస్తున్న బాలిక



గూడెంలోకి కొత్త వ్యక్తి వచ్చాడని భయంగా చూస్తున్న మహిళ

కష్టంగా

ప్రాణాపాయస్థితిలో గురుకుల విద్యార్థి

ములుగు రూరల్‌: మండలంలోని బండారుపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి కార్తీక్‌ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. ఈ నెల 2 తేదీన పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కార్తీక్‌, ప్రణయ్‌ విష పురుగు కాటుకు గురయ్యారు.దీంతో ఉపాధ్యాయులు ఆ విద్యార్థులకు ములుగు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా కార్తీక్‌ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రణయ్‌ ఆరోగ్యం మెరుగుపడుతున్నారు.

'ఆర్టీసీ'లో ఆగిన అవ్వ గుండె



తొర్రూరు: ఆరోగ్యం క్షీణించింది.. ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు గురువారం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలు ఆస్పత్రికి చేరక ముందే ప్రాణం విడిచింది. రాయపర్తి మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన వృద్ధురాలు మామిండ్ల గొరమ్మ(70) ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో రాయపర్తికి తరలించారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో తొర్రూరులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో వచ్చేసరికి గొరమ్మ ఆరోగ్యం విషమించింది. దీంతో 108 అంబులెన్స్‌కు ఫోన్‌ చేయగా వైద్య సిబ్బంది వెంటనే వచ్చారు. అయితే వృద్ధురాలిని తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతి చెందింది. దీంతో మృతురాలి కుమారులు, కుమార్తె, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

గుండె 'గుడి'లో భార్య



పొలం వద్ద కట్టిన గుడి



సరస్వతి విగ్రహం

కొత్తగూడ: ఇంటికి ఇల్లాలు వెలుగు. అలాంటి ఇల్లాలు మధ్యలోనే ఆ కుటుంబాన్ని విడిచిపెట్టి అనంతలోకాలకు వెళ్లింది. భార్యపై ఉన్న ప్రేమానురాగాలు, అనుబంధాన్ని మరిచిపోలేని భర్త ఆమెకు గుడి కట్టి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మహబూబాబాద్‌ జిల్లా కొత్తగూడ మండలం కోనాపురం గ్రామానికి చెందిన కడికాల రమేశ్‌ భార్య సరస్వతి ఏడాదిక్రితం అనారోగ్యంతో చనిపోయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సరస్వతి భౌతికంగా లేకపోయినా ఆమె జ్ఞాపకాలు గుర్తుండేలా రమేశ్‌ తన వ్యవసాయ పొలం వద్ద గుడి కట్టారు. అందులో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని గురువారం ప్రారంభించారు. 'నా భార్య అంటే ఎంతో ప్రేమ. ఆమెతో ఉన్న అనుబంధాన్ని మరిచిపోలేను. అందుకే గుర్తుగా గుడి కట్టి విగ్రహం పెట్టించాను' అని రమేశ్‌ కన్నీటిపర్యంతమయ్యారు.

హైకోర్టు ఏజీపీగా రూహీ నబీల

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



రూహీ నబీల

వరంగల్‌ లీగల్‌: హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన రూహీ నబీలను తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్‌ గవర్నమెంట్‌ ప్లీడర్‌ (ఏజీపీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూహీ ఇంటర్మీడియట్‌ వరకు హనుమకొండలో, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఉస్మానియా యూనివర్సిటీలో చదివారు. తన తండ్రి మహమూద్‌ వరంగల్‌ జిల్లా కోర్టులో న్యాయవాదిగా, ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. తండ్రి బాటలో నడిచి 2016లో తెలంగాణ బార్‌ కౌన్సిల్‌లో తన పేరు నమోదు చేసుకుని న్యాయవాదిగా మొదట వరంగల్‌ కోర్టులో పనిచేశారు. ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం కోసం తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రాక్టీస్‌ మొదలు పెట్టారు. ఈ సందర్భంగా రూహీ నబీల మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను ఎలాంటి పక్షపాతం, తారతమ్యం లేకుండా నిర్వర్తిస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన న్యాయ అధికారులు, ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రూహీ నియామకంపై కేసముద్రం మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సంజీవరెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు సూరపనేని నాగేశ్వరరావు, మాజీ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్‌, వరంగల్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జీవన్‌గౌడ్‌, బార్‌ అసోసియేషన్‌ నాయకులు స్వప్న, రమాదేవి, న్యాయవాదులు, తదితరులు అభినందనలు తెలిపారు.

సీఎస్సీ హెల్త్‌కేర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: సీఎస్సీ హెల్త్‌ కేర్‌ సంస్థలో ఫ్లెబోటమిస్ట్‌ ఉద్యోగాల కోసం ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఎస్సీ హెల్త్‌కేర్‌ సీనియర్‌ హెచ్‌ఆర్‌ ఎగ్జిక్యూటివ్‌ మామిడాల కావ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఎల్‌టీ/ డీఎంఎల్‌టీ/ బీఎస్సీ ఎంఎల్‌టీ/ ఎంఎస్సీ/ జీఎన్‌ఎం కోర్సులు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్‌ సర్టిఫికెట్స్‌, జిరాక్స్‌ కాపీలు తీసుకుని ఈనెల 10,11,12 తేదీల్లో నగరంలోని కాజీపేట పాలిమానగర్‌లోని సీఎస్‌ ఆఫీస్‌ రోడ్డులో గల సీఎస్సీ హెల్త్‌కేర్‌ బిల్డింగ్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63049 87190, 83281 98025 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

నెక్కొండలో ఇంటర్‌సిటీ, జమ్మికుంటలో యశ్వంత్‌పూర్‌కు హాల్టింగ్‌

కాజీపేట రూరల్‌: కాజీపేట, వరంగల్‌ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌, యశ్వంత్‌పూర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లకు ఎస్‌ఓ అండ్‌ డౌన్‌ రూట్‌లో నెక్కొండ, జమ్మికుంట రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మకంగా హాల్టింగ్‌ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌–గుంటూరు (12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌, గుంటూరు–సికింద్రాబాద్‌ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల సర్వీసులను ఆగస్టు 8వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 8వ తేదీ నుంచి గోరఖ్‌పూర్‌–యశ్వంత్‌పూర్‌ (12591) యశ్వంత్‌పూర్‌ ఎక్స్‌ప్రెస్‌, ఆగస్టు 12వ తేదీ నుంచి యశ్వంత్‌పూర్‌–గోరఖ్‌పూర్‌ (12592) గోరఖ్‌పూర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల సర్వీసులకు ఆరు నెలల పాటు నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సుంకిశాలపై సమగ్ర విచారణకు ఆదేశించాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌

ఎల్కతుర్తి: సుంకిశాలపై సమగ్ర విచారణకు ఆదేశించామని, రిపోర్టు తెప్పించుకుని గత ప్రభుత్వ హయాంలో ఎవరైతే బాధ్యులు ఉన్నారో వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంకీశాల గోడ పని జరిగింది బీఆర్‌ఎస్‌ హయాంలోనేనని తెలిపారు. కూలిన మలనలో పూర్తిగా దోషి అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే అని ఆరోపించారు. దీనిపై విచారణకు సిద్ధమేనా..? అని సవాల్‌ విసిరారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాదన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు మనిషిని బట్టకాల్చి మీదపడేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సుంకిశాలపై ప్రాథమిక రిపోర్ట్‌ రాగానే ప్రజలముందు ఉంచుతామన్నారు. కాళేశ్వరానికి సంబంధించి లోపభూయిష్ట నిర్ణయాలతో ప్రజలకు నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటన వ్యక్తిగతం కాదని, అధికారిక పర్యటన అని తెలిపారు. రాష్ట్ర చీఫ్‌ సెక్రటరీతోపాటు ఫైనాన్స్‌ సెక్రటరీ, ఐటీ, పరిశ్రమలకు సంబంధించిన అధికారులతో కలిసి అనేకమంది పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పర్యటనలో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అనేక అంశాలపై ముందడుగు పడుతుందని కుటుంబపరమైన అంశాలు ప్రస్తావిస్తూ ఫిలింలు చేసే ప్రభుత్వ వ్యాఖ్యలను చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు సీఎంగా కొనసాగిన కేసీఆర్‌ కేవలం ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తే బీఆర్‌ఎస్‌ నేతలకు కళ్లమంటలుగా కనిపిస్తోందని అన్నారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్రానికి బాగుచేయాలని ఆలోచనతో ఉన్న ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని బీఆర్‌ఎస్‌ విమర్శిస్తున్నారు. తీరును ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కేటీఆర్‌ అనేక సందర్భాల్లో విదేశీ పర్యటనలు చేశారని, ఒక్కసారి కూడా నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే మాట కూడా మాట్లాడడం చేతకాని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అని విమర్శించారు.

పురాతన ఆలయాలకు పూర్వవైభవం

- నిరాదరణకు గురైన కాకతీయుల ఆలయాల పునరుద్ధరణకు చర్యలు
- రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శైలజారామయ్యర్‌
- 'సాక్షి' కథనానికి స్పందన
- కలెక్టర్‌ సత్యశారదతో కలిసి ఆలయాలు పరిశీలన



మధ్యకోటలో పురాతన ఆలయాలను పరిశీలిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శైలజారామయ్యర్‌, కలెక్టర్‌ సత్యశారద

ఖిలా వరంగల్‌: కాకతీయుల కాలం నాటి పురాతన దేవాలయాలను పునరుద్ధరించి చారిత్రక కోట పూర్వవైభవానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ అన్నారు. 'కూనపోడి.. కనుమరుగు' అనే శీర్షికతో 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మధ్యకోటలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌ హనుమంతరావు, వరంగల్‌ కలెక్టర్‌ సత్యశారద, జిల్లా అటవీ శాఖ అధికారి అనుజ్‌ అగర్వాల్‌ కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ పర్యటించారు. ఈ సందర్భంగా మండమ్మ గుడి, నేలకంపునగిరి, ఏకశిలగుట్టపై రాముడి పాదాలు, త్రికుటాలయాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణ సాధ్యాసాధ్యాలపై కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ, సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్‌ మాట్లాడుతూ ఇటీవల మంత్రి కొండా సురేఖ అధికారులతో కలిసి కోటలో పర్యటించిన కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. మంత్రి ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించామన్నారు. కేంద్ర పురావస్తుశాఖకు సంబంధించిన 14 ఆలయాలు, రాష్ట్ర పురావస్తుశాఖకు సంబంధించిన ఒక ఆలయాన్ని పరిశీలించామని తెలిపారు. ప్రముఖ చరిత్రకారులు, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి ఆలయాల పునరుద్ధరణ చేపడుతామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి, ఏఎస్పీ దీక్షచంద్రకాంత్‌, ఏఈ కృష్ణ చైతన్య, జేసీప మహేష్‌, మల్లేశం, ఏడీ మల్లూనాయక్‌, ఇంటెక్‌ కోకన్వీనర్‌ ప్రొఫెసర్‌ పాండురంగారావు, దేవాదాయశాఖ ఉప కమిషనర్‌ సునీత, 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, తహసీల్దార్‌ బండి నాగేశ్వరరావు, కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, మాజీ కార్పొరేటర్‌ దామోదర్‌యాదవ్‌, టీఎస్‌టీడీసీ ఏఈ విజయ్‌, ఇన్‌చార్జ్‌ అజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల పునఃప్రతిష్ఠకు కమిటీ

హన్మకొండ కల్చరల్‌: పురావస్తుశాఖ పరిధిలో ఉన్న ఖిలా వరంగల్‌ కోటలోని దేవాలయాల్లో విగ్రహాల ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని శైలజా రామయ్యర్‌ ఆదేశించారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో పురావస్తుశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా పురావస్తుశాఖ అధికారి మల్లేశం మాట్లాడుతూ పురావస్తుశాఖ నిబంధనల మేరకు కోటలో విగ్రహాలు ఏర్పాటు చేయడానికి, దీనిని పరిశీలించాలన్నారు.

భద్రకాళి సన్నిధిలో శైలజారామయ్యర్‌

వరంగల్‌ భద్రకాళి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శైలజా రామయ్యర్‌, దేవాదాయశాఖ కమిషనర్‌ హనుమంతరావు, వరంగల్‌ కలెక్టర్‌ సత్య శారద గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓ శేషుభారతి, అర్చకుడు భద్రకాళి శేషు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పూజలు జరిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో కదంబం, మామిడి, నేరేడు మొక్కలు నాటారు.

పదోన్నతులకు లైన్‌ క్లియర్‌..

- సంతోషంలో విద్యుత్‌ ఉద్యోగులు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలం
- యూనియన్‌, అసోసియేషన్‌ నేతలతో ఎన్పీడీసీఎల్‌ సీఎండీ వరుణ్‌ రెడ్డి సమావేశం

హనుమకొండ: విద్యుత్‌ సంస్థల్లో పదోన్నతులకు ప్రభుత్వం నుంచి లైన్‌ క్లియర్‌ అయింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలం వ్యక్తం చేయడంతో అప్పటి పదోన్నతులు జరుగుతాయా లేదోనని ఆందోళనలో ఉన్న ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. తెలంగాణ పవర్‌ జేఏసీతో పాటు, ఆయా ఉద్యోగ యూనియన్లు ముందు పదోన్నతుల చేపట్టి ఆ తర్వాత బదిలీలు చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపట్టడానికైనా సిద్ధమని పేర్కొంటూ యాజమాన్యాలకు నోటీసులు అందజేశాయి. ఈ అంశాన్ని విద్యుత్‌ సంస్థల చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్లు ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన పదోన్నతులకు గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం రాత్రి హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలో విద్యుత్‌ ఉద్యోగుల యూనియన్లు, అసోసియేషన్ల నాయకులతో చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ వరుణ్‌రెడ్డి సమావేశమయ్యారు. పదోన్నతులు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని, యూనియన్లు, అసోసియేషన్లు సహకరించాలని సూచించారు. కండిషన్స్‌ పెట్టి పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు.

బీసీ అసోసియేషన్‌ అభ్యంతరం..

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌ నాయకులు పాత పద్ధతిలో రిజర్వేషన్‌ కమ్‌ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోరగా బీసీ అసోసియేషన్‌ నాయకులు అభ్యంతరం తెలిపారు. మెరిట్‌ కమ్‌ సీనియారిటీ పద్ధతిలోనే చేపట్టాలని కోరారు. దీంతో సీఎండీ వరుణ్‌ రెడ్డి మీరంతా కలిసి ఒక నిర్ణయానికి వస్తే ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసి సమావేశం ముగించారు.

ఆశ తీరకుండానే రిటైర్మెంట్‌..

కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో 20 ఏళ్లగా ఒకే పోస్టులో కొనసాగుతూ ఇవాలో.. రేపో పదోన్నతి రాకపోతుందా అని ఎదురుచూసి చివరకు ఆశ తీరకుండానే కొందరు ఉద్యోగులు రిటైర్డ్‌ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ నుంచి ఇంజినీర్లు రావడంతో రాష్ట్రానికి చెందిన ఇంజినీర్లు పదోన్నతులు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్‌ నుంచి ఏడీఈలు సీనియార్టీ కావడంతో రాష్ట్ర పదోన్నతులు కల్పించారు. దీంతో స్థానికత కలిగి ఉండి ఎస్పీ ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న 12 మంది సీనియర్‌ అసిస్టెంట్‌ డివిజన్‌ ఇంజినీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కొందరికి రివర్షన్‌ ఇచ్చారు. ఆదిలాబాద్‌ ఎస్‌ఈగా పనిచేస్తున్న జడ్‌.ఉత్తమ్‌, డీఈగా రివర్షన్‌ పొందారు. డీఈలుగా పని చేస్తున్న ఉపేందర్‌, ఏ.నాగదేవేశ్‌ ఏడీఈలుగా రివర్షన్‌ ఇచ్చారు. సీజీఎం హోదాలో సీజీఆర్‌ఎఫ్‌లో టెక్నికల్‌ మెంబర్‌గా పని చేస్తున్న చరణ్‌దాస్‌కు జీఎంగా రివర్షన్‌ ఇచ్చారు. వచ్చిన వారు సీనియర్లు కావడంతో స్థానికులు సీనియారిటీలో వెనుకబడ్డారు.

సొంత ప్రాంతానికి వెళ్లిన 14 మంది ఉద్యోగులు..

ఎస్సీ, ఎస్టీ ఇంజినీర్లు తిరిగి సొంత ప్రాంతానికి వెళ్లడానికి సుప్రీం కోర్టు అవకాశం కల్పించగా 14 మంది వెళ్లారు. దీంతో వెళ్లిపోయిన వారిలో ఎస్సీ, ఎస్టీలైన అదనపు డివిజన్‌ ఇంజినీర్లు, ఆయురు అసిస్టెంట్‌ డివిజన్‌ ఇంజినీర్లు, ఒక సీనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌, ఒక్క సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ ఉన్నారు. ఈ పోస్టులు ఖాళీ కావడంతో మరోసారి స్థానిక ఏడీఈల్లో తమకు పదోన్నతులు లభిస్తాయనే ఆశలు చిగురించాయి. ఈ క్రమంలో మెరిట్‌ కమ్‌ సీనియారిటీ, రిజర్వేషన్‌ కమ్‌ సీనియారిటీ అంశం సమస్యగా పరిణమించింది. దీంతో పాటు అంశం కోర్టుకు వెళ్లింది. కోర్టులో కేసులు ఉండడంతో యాజమాన్యం పదోన్నతుల ప్రక్రియకు ముందుకు రాలేదు. మరో వైపు బదిలీలకు మార్గదర్శకాలు రావడంతో పదోన్నతులకు బదులు బదిలీలు చేసే పదోన్నతుల ప్రక్రియ నిలిపివేయడని, ఉద్యోగులు, ఇంజినీర్ల సంఘం జరుగుతుందని యూనియన్లు, అసోసియేషన్లు యాజమాన్యం పై ఒత్తిడి పెరిగింది. ఆలా పదోన్నతులు కల్పించాలని యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని ఉద్యోగుల నుంచి డిమాండ్‌ పెరిగింది. ఈ క్రమంలో ఉద్యోగుల జేఏసీ, యూనియన్లు, అసోసియేషన్‌తో పాటు అవసరమైతే కోర్టు తీర్పుకు లోబడి కండిషన్స్‌తోనైనా పదోన్నతి కల్పించాలని సంఘాలు ఇచ్చాయి. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పదోన్నతులు కల్పించనున్నట్లు తెలుపడంతో పదోన్నతుల ప్రక్రియకు లైన్‌ క్లియర్‌ అయింది. పదోన్నతులతో ఖాళీలు స్పష్టత వస్తుందని, తర్వాత బదిలీల జరిపితే ఖాళీలు భర్తీ చేయడానికి మార్గం సుగమమవుతుందని యూనియన్‌, అసోసియేషన్ల నాయకులు తెలిపారు.